క్లుప్తంగా

విద్యార్థులకు ఘన సన్మానం

అచ్చంపేట రూరల్: స్మార్ట్ జీనియస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అబాకస్ మ్యాథ్స్ టాలెంట్ టెస్టు గ్లోబల్ లెవల్‌లో పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ర్యాంకు సాధించిన విద్యార్థులు మణికంఠ, రక్షితలను సోమవారం ఉపాధ్యాయ బృందం పాఠశాలలో సన్మానించారు. స్కూల్ కరస్పాండెంట్ మల్లారెడ్డి విద్యార్థులను అభినందించారు.

పంటలసాగు నమోదు తప్పనిసరి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో యాసంగిలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏఓ సాయిరమేష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో పంటలు విక్రయించే సమయంతో ఇబ్బందులు రావని ఆయన పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కోడేరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ విజయ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికలు భాగంగా ఆయా కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, తదితర సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సిబ్బంది ఆర్ఐ సురేందర్ పాల్గొన్నారు.

కోతలు లేని విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం

అచ్చంపేట రూరల్: అచ్చంపేట సబ్ డివిజన్ పరిధిలో వినియోగదారులకు, రైతులకు కోతలు లేని విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని అచ్చంపేట ఏడీఈ కామేశ్వర్‌రావు, ఏఈ ఆంజనేయులు తెలిపారు. సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ పంపిణీ సంస్థ నుంచి ఎటువంటి అధికారిక కోతలు లేకుండా సరిపడు నిరంతర విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామన్నారు. అధిక కోతలు ఉన్నాయని దుష్ప్రచారం చేయడం సరైంది కాదన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్య ఉన్నా సంబంధిత మండలాల ఏఈలు, సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు.

మండల కమిటీ ఎన్నిక

పెద్దకొత్తపల్లి: టీఎస్‌యూటీఎఫ్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కమిటీ మండల కన్వీనర్‌గా మల్లయ్య, కో కన్వీనర్‌గా ఆర్ మహేశ్‌లను ఎన్నుకున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి బి ఆంజనేయులు పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరి రోజు సోమవారం హోమం, పూర్ణాహుతి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో భగవద్గీత మహాజ్ఞానం పుస్తకాలను ఆలయ ట్రస్టు చైర్మన్ జంగం జీవన్‌కుమార్, కృష్ణచైతన్య సంఘం సభ్యులు కృష్ణయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రామన్‌గౌడ్‌కు పోలీస్ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో కోట్ల సురేందర్, నరేష్, శేషు, హెడ్‌కానిస్టేబుల్ రామస్వామిలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

తాడూరు: యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని మేడిపూర్‌లో రైతు వెంకట్‌రెడ్డి సాగు చేసిన ఆయిల్ పాంతోటల్లో రైతులకు యాజమాన్య పద్ధతులపై ఉద్యానవన అధికారులు అవగాహణ కల్పించారు. అంతర పంటల సాగు వాటి ఆవశ్యకత, మార్కెంటింగ్, పంటలకు వచ్చే రాయితీలు వివిధ అంశాలను వివరించారు.

నిలిచిన కాల్వ పనులు

కల్వకుర్తిరూరల్: కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన కాల్వలలో అసంపూర్తి పనులను ఇటీవల ప్రారంభించారు. ప్రస్తుతం కాల్వలలో నీరు నిలిచిపోవడంతో పనులను నిలిపివేశారు. వర్షాకాలం ప్రారంభమయ్యేలోగా పనులన్ని పూర్తి కావాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చిన ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. వెంటనే పూర్తి చేయాలని రైతులు డిమాండ్ కోరుతున్నారు.

కంటి వైద్య శిబిరం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటంలో సోమవారం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మొత్తం 100 మందికి పరీక్షించగా అందులో 20 మందిని ఆపరేషన్ అవసరమని వైద్యులు తెలిపారు.

విద్యార్థినికి అస్వస్థత

లింగాల: మండలంలోని కోమటికుంట ప్రాథమికోన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని కడెం లోకేశ్వరీ సోమవారం అస్వస్థతకు గురైంది. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్న తర్వాత విద్యార్థినికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో విద్యార్థిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తెల్కపల్లికి తరలించారు. కాగా పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో ఎలాంటి లోపం లేదని, బాలిక ఉదయం ఇంటి దగ్గర అల్పాహారం తీసుకోకపోవడంతో తలనొప్పిగా ఉందని తోటి విద్యార్థులతో తెలిపినట్లు హెచ్ఎం అంజిలాల్ వివరణ ఇచ్చారు.

సేవాలాల్ మార్గదర్శకుడు


లింగాలలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

లింగాల: బంజారాల కులదైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారాలకు మార్గదర్శకుడని, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సేవాలాల్ జయంతి ఉత్సవాలలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని మేరమ్మ భవానీ ఆలయం ఆవరణలో నిర్వహించిన భోగ్‌బండార్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేరమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంత్ సేవాలాల్ గొప్ప దైవభక్తుడని, బంజారాల ఆచారాలు, సంస్కృతి పరిరక్షణకు నిరంతరం పోరాడిన మహానుభావుడన్నారు. బంజారాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అంతకుముందు బంజారా యువకులు 2కే రన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం నాయకులు మోపతయ్య, జెడ్పీటీసీ నేజమ్మ, జిల్లా వైద్యాధికారి సుధాకర్‌లాల్, గిరిజన నాయకులు శంకర్‌రాథోడ్, రాజునాయక్, శ్రీనివాస్‌రాథోడ్, కిషన్‌నాయక్, రాంజీనాయక్, హన్మంతునాయక్, జయరాంనాయక్, బాలాజీనాయక్, కిషన్‌లాల్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి..

వంగూరు: మండల కేంద్రంలోని రామలింగేశ్వర స్వామి దేవస్థాన అభివృద్ధికి కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం దేవాలయంలో నిర్వహించిన మహా పడిపూజలో ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి వారు ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం నిధుల మంజూరుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు యాదగిరిరావు, రమేష్‌గౌడ్, జనార్ధన్, షేర్‌ఖాన్, శివశంకర్, చంద్రశేఖర్, సతీష్‌రెడ్డి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన..

అమ్రాబాద్: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత మొదటి సారి ఆయన స్వంత గ్రామమైన ఎల్మపల్లి గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో రూ.60 లక్షల నిధులతో చేపట్టనున్న పాఠశాల, దేవాలయం ప్రహారీల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని విద్యా, వైద్యం, పర్యాటకంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ ప్రణీత, తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ మోతిలాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరినారాయణగౌడ్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: అంగన్‌వాడీ టీచర్ల, ఆయాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఆయాల సమస్యలు పరిష్కరించాలని ఐసీడీఎస్ అధికారులకు మెమోరాండం సమర్పించారు. కల్వకుర్తిలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు హాజరయ్యారు. ఖాళీగా ఉన్న 9వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కొల్లాపూర్ ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓ జమీల్‌కు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ వినతిపత్రం అందజేశారు. అచ్చంపేటలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆయాలు ఆందోళన చేపట్టారు. గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ


అచ్చంపేట ఐనోల్ జెడ్పీహెచ్ఎస్‌లో...


చారకొండ మండలం జూపల్లిలో

సాక్షి, నెట్‌వర్క్: అచ్చంపేట మండలంలోని ఐనోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చారకొండ మండలం జూపల్లి ప్రాథమిక పాఠశాల, తెలకపల్లిలోని సిద్ధార్థ పాఠశాలలో సోమవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధికారులుగా, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



నాగర్‌కర్నూల్‌రూరల్: రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని బీఎస్పీ జిల్లా నాయకులు అంతటి నాగన్న, బీసమోల్ల యోసోఫ్ అన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో వాల్‌పోస్టర్లను వారు విడుదల చేశారు. దేశంలో కులమత వర్ణ వివక్షతలు, అసమానతలు ఇప్పటికి కొనసాగడం దారుణమన్నారు. రాజ్యాంగం ద్వారానే స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం, లౌకికవాదం సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పృథ్వీరాజ్, మోహన్‌రెడ్డి, మహేష్ యాదవ్, కళ్యాణ్, రాంచందర్, వెంకటేష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

కోడేరు: ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కురుమూర్తి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక తరలించేందుకు అధికారుల అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తు కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా ఇసుక తరలించినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అభ్యర్థులకు ఇంటర్వ్యూలు



నాగర్‌కర్నూల్: జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేయబోయే నాలుగు మీసేవ కేంద్రాలకు కలెక్టర్ భవనంలోని అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లాలోని వంగూరు మండలంలో గల కొండారెడ్డిపల్లి, తాడూరు, కోడేరు మండలంలోని మైలారం, తీగలపల్లి గ్రామాలకు మీసేవ కేంద్రాల నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకున్న 33 మంది అభ్యర్థులకు గాను 28 మంది అభ్యర్థులు ఈ నెల20న ఏర్పాటు చేసిన పరీక్షకు హాజరయ్యారు. అందులో 12 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో భాగంగా వారికి ఇంటర్వ్యూలు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, సూపరింటెంట్ కార్తీక్, సీపీఓ భూపాల్ రెడ్డి, ఈడీఎం నరేష్ పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ

లింగాల: మండల కేంద్రంలోని పంచాయతీలో రికార్డులను సోమవారం ఎంపీడీఓ ఆంజనేయులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీకి సంబంధించిన నిధుల వ్యయంతో పాటు, పన్నుల వసూళ్లు, బకాయిలు తదితర వాటిని పరిశీలించారు. ఎంపీఓ కర్ణనాయక్, కార్యదర్శి ఉన్నారు.

ఎస్టీ సెల్ అధ్యక్షుడికి సన్మానం

కల్వకుర్తిరూరల్: బీజేపీ గిరిజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవలే నియామకం అయిన కల్యాణ్ నాయక్ సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా నాయకులు అయనను సత్కరించి అయోధ్య బాలరాముడి చిత్రపటాన్ని బహూకరించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దుర్గా ప్రసాద్, పట్టణాధ్యక్షుడు నర్సింహా, జిల్లా నాయకులు రాఘవేందర్‌గౌడ్, రవిగౌడ్, వివేకానంద, నరేష్ గౌడ్, చందు, రాంరెడ్డి, శివ, చింటు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేటలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం బండలాగుడు పోటీలను నిర్వహించారు. మొదటి బహుమతి గోరేటిపల్లికి చెందిన బీరయ్య రూ.20 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు మధుసూదన్‌రెడ్డి, గెలుచుకున్నారు. దేవస్థానం చైర్మన్ భీమయ్య, మాజీ సర్పంచ్ బాలస్వామి, భక్తులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కందనూలు: ఆర్టీసీ బస్సుల వేళలు, కార్గో సేవలు, రూట్లలో ఎదురవుతున్న సమస్యలు, ఇతర అంశాలకు సంబంధించి మంగళవారం నాగర్‌కర్నూల్ డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్న డిపో మేనేజర్ దేవరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు ఫోన్ చేయాలని తెలిపారు. సెల్: 99592 26288 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మొక్కు చెల్లించుకున్న జెడ్పీటీసీ

మన్ననూర్: శాసన సభ ఎన్నికల్లో అచ్చంపేట అసెంబ్లీకి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ వంశీకృష్ణ గెలుపొందితే మైసమ్మకు 51 కొబ్బరికాయలు కొడుతానని అమ్రాబాద్ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ మొక్కుకున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉమామహేశ్వర కాలనీలోని మైసమ్మ అమ్మవారికి నాయకులతో కలిసి కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు.

ఎస్సీలకు దుకాణాలు కేటాయించాలి

కొల్లాపూర్: పట్టణంలోని గ్రంథాలయ షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలకు ఎస్సీలకు రిజర్వేషన్ ప్రకారం కేటాయించాలని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సూపరింటెండెంట్ కార్తీక్‌కు వినతిపత్రం అందజేశారు.ఆయన వెంట తెలంగాణ మాదిగ దండోరా నియోజకవర్గ అధ్యక్షుడు మల్లెల సుధాకర్ ఉన్నారు.

యాదవ జర్నలిస్టులు ఐక్యతగా ఉండాలి

నాగర్‌కర్నూల్: యాదవ జర్నలిస్టులు అందరూ కలసి కట్టుగా ఉండాలని అఖిల భారత యాదవ మహసభ అధ్యక్షుడు లాలు యాదవ్, తెలంగాణ యాదవ జర్నలిస్ట్ అసోసియేషన్ జర్నలిస్ట్ మేకల కృష్ణ అన్నారు. సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో సింగిల్ విండో కార్యాలయం మినీ కన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రథమ మహాసభను నాగేషయ్య అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో హరి కృష్ణ యాదవ్ ,నాగరాజు యాదవ్, బాలకృష్ణయాదవ్, కొండన్న యాదవ్. ఆంజనేయులు యాదవ్ , శ్రీనివాస్ యాదవ్,కృష్ణ యాదవ్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన



పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాములలో అగ్రి లీగల్ క్లీనిక్ ఆధ్వర్యంలో తెలంగాణ నీటి పారుదల చట్టంపై సోమవారం ప్యారా లీగల్ వలంటీర్ శ్రీనివాసులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 సంవత్సరానికి ముందు ఉన్న బోర్లు, బావులను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రైతులు తప్పనిసరిగా బోరు వేసే ముందు తహసీల్దార్‌తో అనుమతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భానుప్రకాశ్‌రెడ్డి, యాదగిరి రెడ్డి, రైతులు, పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా



నాగర్‌కర్నూల్‌రూరల్: రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల్ నర్సింహ అన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఢిల్లీలోని మోదీ ప్రభుత్వం రైతులపై జరిపిన కాల్పులకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్ ఆనంద్‌జీ, కేశవులు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింహా, విజయుడు, ఏఐకేఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణాజీ, బాలమురళీకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్, నాయకులు మధుగౌడ్, వెంకటమ్మ, కేశవులు, శేఖర్, రాధాకృష్ణ, మద్దిలేటి, శివకృష్ణ, బాలపీరు, బండి కృష్ణయ్య పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

కొల్లాపూర్: పట్టణంలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తహసీల్దార్ శ్రీకాంత్ వెల్లడించారు. ఈనెల 28 నుంచి పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పట్టణంలోని జిరాక్స్ దుకాణాలు మూసి ఉంచాలని ఆయన సూచించారు. కొల్లాపూర్‌లోని ఆర్ఐడీ ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలు, గాయత్రీ జూనియర్ కళాశాల, టీఎంఐఎస్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు ఆయన పేర్కొన్నారు.

వైభవంగా పెద్దమ్మ తల్లి ఉత్సవాలు


మండలం బైరాపూర్‌లో విగ్రహాలను ఊరేగింపు నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

వెల్దండ: మండలంలోని బైరాపూర్‌లో పెద్దమ్మ తల్లి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలతో విగ్రహాలను ఊరేగించారు. ఈ నెల 27న గణపతిపూజ, మహాహారతి, మంత్రపుష్పం, 28న యంత్రం విగ్రహ ప్రతిష్ఠాపన, మహాపూర్ణాహుతి, 29న అమ్మవారికి బోనాలు సమర్పిస్తునట్లు ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మెండె మల్లేష్‌యాదవ్, వైస్ చైర్మన్ రామచంద్రయ్యయాదవ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

బదిలీల్లో ఎమ్మెల్యే ప్రమేయం సరికాదు


ఎంపీడీఓ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

తెలకపల్లి: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ప్రమేయంతో ఇతర ప్రాంతానికి బదిలీ చేయడం సరైంది కాదని బీఎస్పీ మండల అధ్యక్షుడు శివశంకర్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న అధికారులను తీసుకొచ్చేందుకు ఇక్కడ అంకితభావంతో పనిచేస్తున్న కార్యదర్శిని బదిలీ చేశారని వివరించారు. ఏకపక్షంగా అధికారులను బదిలీ చేయడం ఏంటని ప్రశ్నించారు. వెంటనే బదిలీని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు గుగ్గిల్ల రాజేష్, బారిగారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు పరిశీలన


శాస్త్ర ఇంటర్నేషనల్ పాఠశాలను పరిశీలిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

వెల్దండ: మండలంలోని కొట్ర గేట్ వద్ద ఉన్న శాస్త్ర ఇంటర్నేషనల్ స్కూల్‌ను విద్యార్థి సంఘం నాయకుడు సంతోష్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో మౌలిక వసతులను పరిశీలించారు. అధిక ఫీజులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మహేష్, రాహుల్, పర్వతాలు, మహేందర్, దేవ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

పంచాయతీ వర్కర్ల ధర్నా


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

పెంట్లవెల్లి: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం సీఐటీయూ నాయకులు కార్మికులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ ప్రసన్నకుమారికి అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు ఈశ్వర్ మాట్లాడుతూ మండలంలోని గోప్లాపూర్‌లో ఏడు నెలల నుంచి గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు రాక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

చెంచులతో అధికారుల ముఖాముఖి


మాట్లాడుతున్న ఎంపీడీఓ మోహన్‌లాల్

మన్ననూర్: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కారానికి అనుసరించాల్సిన విధానాలపై చెంచులకు అవగాహన కల్పించినట్లు అమ్రాబాద్ ఎంపీడీఓ మోహన్‌లాల్ అన్నారు. శుక్రవారం అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లబావి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కోనేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెంచులతో అధికారుల ముఖాముఖి, అవగాహన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలన్నారు. ప్రధానమంత్రి జన్‌మన్‌లో భాగంగా ప్రతి చెంచు కుటుంబంలోని వారందరికి ఆధార్, బ్యాంక్ అకౌంటు, పాన్‌కార్డు వంటి సామాజిక భద్రతలను కల్పించడంతో పాటూ ఎప్పటికప్పుడు ఉపాధి హామీ కూలీ డబ్బులు బ్యాంకులో జమ అయ్యేందుకు గానూ చెంచుల కోసం మన్ననూర్‌లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఏప్రిల్ 1వ తేదీ వరకు ఓటరు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉన్నందున 18 ఏండ్లు నిండిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉచితంగా ప్రభుత్వం విద్యుత్ మీటర్లు ఇస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ జిల్లా సమన్వయకర్త మల్లేష్, బీపీఎం రామస్వామి, ఏఎస్ఓ జావిద్, ఏపీఓ రఘు, ఏఈఓ సీతారాం, ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డబ్ల్యూటీఓ నుంచి భారత్ వైదొలగాలి



పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రపంచ వాణిజ్య సంస్థ డబ్ల్యూటీఓ నుంచి భారతదేశం తక్షణమే వైదొలగాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ రైతుసంఘం, సీఐటీయూ జిల్లా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ దేశంలో కార్మికులు, ప్రజలు, రైతులు, తీవ్రమైన సమస్యలతో, ఆర్థిక ఇబ్బందులకు కారణం 1991లో భారత్ డబ్ల్యూటీఓ చేరడమేనని ఆరోపించారు. దేశంలో బీజేపీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వల్ల రైతాంగం, కార్మికులు సంక్షోభంలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు వర్ధం పర్వతాలు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శి రమేష్, నాగరాజు గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్, బాలరాజు, శ్రీరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

వెల్దండ: మండలంలోని బైరాపూర్‌లో సోమవారం సీసీరోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకుడు వెంకటేష్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.25 లక్షల నిధులను సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు తదితరులు ఉన్నారు.

ముగిసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



కోడేరు: మండల కేంద్రంలోని మూడు రోజుల పాటు నిర్వహించిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిసాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, ప్రాతకాల పూజలు, సత్యనారాయణ స్వామి వ్రతం, మహా మంగళహరతి, ప్రదోషకాల పూజలు, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఊరేగింపు భక్తిశ్రద్ధలతో కొనసాగింది. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రాఘవేంద్రశర్మ, భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములవుదాం



తాడూరు: అభివృద్ధిలో అందరూ భాగస్వాములవులు కావాలని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండల కేంద్రానికి సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. జెడ్పీటీసీ రోహిణి, ఎంపీటీసీ రేణుక, నారాయణ, కోటి, నిరంజన్, పర్వతాలు, మల్లేష్, కృష్ణయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కందనూలు: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.

చెట్లను తొలగిస్తే చర్యలు

కొల్లాపూర్: అడవి ప్రాంతంలో చెట్లను తొలగిస్తే చర్యలు తీసుకుంటామని రేంజర్ శరత్‌చంద్రారెడ్డి హెచ్చరించారు. సోమవారం మండలంలోని ఎల్లూరు బీట్ పరిధిలో గల అటవీ ప్రాంతంలో నార్లాపూర్ గ్రామానికి చెందిన కొడావత్ శాంతమ్మ భర్త కొడావత్ ధర్మ కొన్ని చెట్లను తొలగించి భూమిని చదును చేసేందుకు యత్నించారు. అటవీ అధికారులు సోమవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించి దంపతులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.